# 59

# రెండవ రాకడ

## (24:36-51)

యేసు తన శిష్యులకు యెరూషలేము నాశనము గూర్చి సవివరంగా వివరించిన తదుపరి, ఆయన తన రెండవ రాకడ గూర్చి వారితో ముచ్చటించాడు.

### ఆ గడియను ఎవడును ఎరుగడు (24:36–41)

**36అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియనుగూర్చియు తండ్రి మాత్రమే (యెరుగును)**
**గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను కుమారుడైనను ఎరుగరు.**
**37నోవహు దినములు ఏలాగుండెనో మనుష్యకుమారుని రాకడయును ఆలాగే ఉండును.**
**38జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినమువరకు,**
**వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచునుండి 39జలప్రళయమువచ్చి**
**అందరిని కొట్టుకొనిపోవు వరకు ఎరుగక పోయిరి; ఆలాగుననే మనుష్యకుమారుని రాకడ**
**ఉండును. 40ఆ కాలమున ఇద్దరు పొలములో ఉందురు, ఒకడు తీసికొనిపోబడును**
**ఒకడు విడిచిపెట్టబడును. 41ఇద్దరు స్త్రీలు తిరుగలి విసరుచుందురు, ఒకతె తీసికొని**
**పోబడును, ఒకతె విడిచిపెట్టబడును.**

**వచనము 36.** యెరూషలేము నాశనము గూర్చిన అంశమును విడిచిపెట్టి, యేసు తన దృష్టిని సంపూర్తిగా రెండవ రాకడపై కేంద్రీకరించాడు. **అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును, గాని యే మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు** అని ఆయన సెలవిచ్చాడు. ఆయన తిరిగి ఎప్పుడు వచ్చునో లేక యుగ సమాప్తి ఎప్పుడు జరుగునో యే మనుష్యుడైనను ఎరుగడని యేసు మామూలు మాటలో వారికి తెలియజెప్పాడు. యుగ సమాప్తి సంభవించు తేదీని లెక్కలు వేయుటకు లేక ఆ తేదీని ముందుగానే ప్రవచన రీతిగా పలుకుటకు ప్రయత్నించువారు వారి సమయాన్ని మరియు ప్రయాసను వృథాచేసికొనుచున్నారు.

యేసు, దేవుడై యుండి సర్వజ్ఞుడునై యుండినప్పటికిని, యుగ సమాప్తి సమయమును తెలిసికొను విషయంలో ఆయన తనను తాను నిగ్రహించుకొన్నాడు. కుమారుడు సహితము తన సొంత రాకడ సమయమును ఎరిగియుండలేదను వాస్తవము అనేకులకు ఆశ్చర్యము కలిగించవచ్చును.[1] "వాక్యము శరీరధారియైనప్పుడు" (యోహాను 1:14) ఆయన దేవుడై యుండుట కొనసాగినది, కానీ ఆయన తన సర్వవిజ్ఞతను వినియోగించుకొనకూడదని ఎన్నుకొన్నాడు (చూడు ఫిలిప్పీయులకు 2:6, 7). యేసు పెరిగి పెద్దవాడగుచు, ఆయన శారీరక రీతిగా మాత్రమే కాదు కానీ మేధా శక్తిలో సహితము వర్ధిల్లాడు (లూకా 2:52). తన పరిచర్యలో ప్రవేశించిన తొలి రోజున్నే పరిశుద్ధాత్మ చేత అభిషేకింపబడినవాడైన తరువాత (3:16; లూకా 4:18; అపొస్తలుల కార్యములు 10:38), అనేక సందర్భములలో

ఆయన అందరినీ అబ్బురపరచు జ్ఞానమును వినియోగించాడు. ఏది ఏమైనా, ఆయన ఈ విధంగా ప్రతీ సారి చేయలేదు. రాబర్ట్ హెచ్. గుండ్రి ఈ విషయమును ఈ క్రింది విధంగా పరిగణించాడు:

> పరలోక రాజ్య విస్తారణ విషయంలో తప్ప ఇతరమైన ఏ విషయంలోనైనను యేసు తన సర్వశక్తిమంతిత్వమును వినియోగించుకొనని విధంగానే (రాళ్లను, రొట్టెలుగా చేయుటకు నిరాకరించిన విషయమును పోల్చి చూడు), ఆయన తన సర్వవిజ్ఞతను కూడ పరలోక రాజ్య విస్తరణ విషయంలో తప్ప ఇతరమైన ఏ విషయంలోనైనను వినియోగించుకొన లేదు. ఆయన రాకడ సమయమును ఆయన స్వయంగా ఎరిగియుండుట మరియు ఇతరులకు ఎరుకచేయుట, నిర్లక్ష్యమును ప్రోత్సాహించుట ద్వారా పరలోక రాజ్య విస్తరణ పనులకు తత్కాల సమయంలో అపారమైన నష్టమును కలిగించేదే.[2]

**వచనములు 37-39. నోవహు దినములలో** ఆకస్మికముగా వచ్చిన జలప్రళయము ఏలాగుండెనో **మనుష్యకుమారుని రాకడయును** ఆలాగే యుండునని పోల్చుచు యేసు ఒక సోదాహరణ చిత్రీకరణమును వారి ముందుంచాడు. సామాన్య జనజీవితము ఎటువంటి భంగము కలుగకుండా నిరంతరాయంగా కొనసాగుచుండినదని సూచించుటకు ఆయన **జలప్రళయమునకు ముందు** జరిగిన కొన్ని కార్యకలాపములను వర్ణించాడు. **తినుచు మరియు త్రాగుచు** నుండిరి అను మాటలు మించుదలను సూచించుచున్నవి (నిర్గమకాండము 32:6; మత్తయి 24:49), అయితే ఇచ్చట అవి అనుదిన ఆహారమును ఆరగించుటను ప్రస్తావించుచున్నవి. **పెండ్లి చేసికొనుచు, పెండ్లికిచ్చుచు** అను మాటలు కూడ సామాన్య దైనందిన జీవితాన్ని సూచించుచున్నవి (22:30పై గల వ్యాఖ్యానము చూడు).

**నోవహు** పాపిష్ఠి ప్రజానీకమునకు ప్రబోధించి, ఆ మీదట వారి కళ్ల ముందే ఒక **ఓడను** నిర్మించాడు (ఆదికాండము 6:5-7; హెబ్రీయులకు 11:7; 1 పేతురు 3:19, 20; 2 పేతురు 2:5), కానీ జల ప్రళయము ఎప్పుడు పరుగులు తీయుచు వచ్చునో వారికి ఏమియు ఎరుక లేదు. వారు బ్రతికి బయటబడుటకు తమ్మును తాము సిద్ధపరచుకొనవలసి యుండినది. దానికి బదులుగా, వారు తమ దైనందిన జీవన విధానము కొనసాగించుచు అతడు **ఓడలోనికి వెళ్లిన దినము వరకు** చేసిన హెచ్చరికలను అలక్ష్యము చేసారు. వానలు కురిసాయి, వరద వచ్చింది, నీటి మట్టము పెరుగుటకు మొదలయ్యింది, అట్లయినను వారు వినలేదు గనుక అట్టి నిర్ణయము గూర్చి వారు నిస్సందేహముగా చింతించి యుందురు.

**వచనములు 40, 41.** యేసు తిరిగి వచ్చినప్పుడు, నోవహు దినములలో వలెనే, జనజీవనము మామూలుగా కొనసాగుచుండును, స్త్రీ పురుషులు వారి దైనందిన కార్యకలాపములను చేసికొనుచుందురు. పాలస్తీనాలోని ప్రజల దైనందిన సామాన్య అనుభవములను సద్వినియోగము చేసికొనుచు, యేసు పురుషులు **పొలములో** పనిచేయుచుండుట, స్త్రీలు **తిరుగలి విసరుచుండుట** గూర్చి మాటలాడాడు. **ఇద్దరు పురుషులు** మరియు **ఇద్దరు స్త్రీలకు** సంబంధించినంత వరకు, **ఒకరు కొనిపోబడుదురు మరియు ఒకరు విడిచిపెట్టబడుదురని** యేసు తెలియజెప్పాడు. "కొనిపోబడుట" (*paralambanō*) అను క్రియాపదము బహుశా రక్షణ సంబంధంగా నిర్మాణాత్మకమైన అవగాహనతో అర్థంచేసికొనబడవలెను. 39వ వచనములో భిన్నమైన పదము *airō* అగుపించుచున్నది, అచ్చట దుష్ట తరము కొనిపోబడినది. నోవహు మరియు ఈ దుష్ట తరము వలెనే, కేవలము

రెండు వర్గములకు చెందిన ప్రజలున్నారు: సిద్ధపడినవారు (రక్షింపబడినవారు) మరియు సిద్ధపడనివారు (నశించినవారు). యేసు రాకడ సంపూర్తియైనది మరియు శాశ్వతమైన విభజనకు సంకేతమై యున్నది.[3]

సహస్రాబ్దికాల సుపరిపాలనకు ముందటి కాలము గూర్చి వాదించువాని దృష్టికోణము, "ఎత్తబడుట" గూర్చిన దాని అభిప్రాయమును ముఖ్యంగా 1 థెస్సలొనీకయులకు 4:13-17 నుండి ఉత్పాదించుకొన్నది గనుక మత్తయి 24:40, 41లో ఇవ్వబడిన వర్ణనను దాని సంబంధములో ప్రయోజనపర్చుకొన్నది. రక్షింపబడినవారు ఏడేళ్ల మహా శ్రమలకు మునుపు, ప్రభువుతో కూడ ఎత్తబడుదురని ఆ దృష్టికోణము ఆశించుచున్నది. ఏది ఏమైనా, నీతిమంతులను మాత్రమే లేపవలెనని దేవుడు ఉద్దేశించుచున్నాడని క్రొత్త నిబంధన బోధించుటలేదు (చూడు 1 కొరింథీయులకు 15:50-54; 1 థెస్సలొనీకయులకు 4:13-17). వాస్తవమునకు, తీర్పు తీర్చబడు నిమిత్తము దైవభక్తిగలవారు లేపబడిన అదే సమయంలో, లేదా అదే రోజున దైవభక్తిలేనివారు సహితము లేపబడుదురని యేసు ప్రకటించాడు (యోహాను 5:25-29).

## మెలకువగా ఉండుడి (24:42-51)

**42కావున ఏ దినమున మీ ప్రభువు వచ్చునో మీకు తెలియదు గనుక మెలకువగా నుండుడి.**
**43ఏ జామున దొంగవచ్చునో యింటి యజమానునికి తెలిసియుండినయెడల అతడు**
**మెలకువగా ఉండి తన యింటికి కన్నము వేయనియ్యడని మీరెరుగుదురు. 44మీరనుకొనని**
**గడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుక నే మీరును సిద్ధముగా ఉండుడి.**
**45యజమానుడు తన యింటివారికి తగినవేళ అన్నము పెట్టుటకు వారిపైన ఉంచిన**
**నమ్మకమైనవాడును బుద్ధిమంతుడునైన దాసుడెవడు? 46యజమానుడు వచ్చినప్పుడు ఏ**
**దాసుడు ఈలాగు చేయుచుండుట అతడు కనుగొనునో ఆ దాసుడు ధన్యుడు. 47అతడు తన**
**యావదాస్తిమీద వాని నుంచునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. 48అయితే దుష్టుడైన**
**యొక దాసుడు-నా యజమానుడు ఆలస్యము చేయుచున్నాడని తన మనస్సులో అనుకొని**
**49తన తోడి దాసులను కొట్ట మొదలుపెట్టి, త్రాగుబోతులతో తినుచు త్రాగుచునుంటె 50ఆ**
**దాసుడు కనిపెట్టని దినములోను వాడనుకొనని గడియలోను వాని యజమానుడు వచ్చి,**
**వానిని నరికించి వేషధారులతో కూడ వానికి పాలు నియమించును. 51అక్కడ ఏడ్పును**
**పండ్లు కొరుకుటయు నుండును.**

**వచనము 42.** యేసు మరలా **ఎప్పుడు వచ్చునో** భూమి మీద నున్న ఏ ఒక్కరైనను ఎరుగజాలడు గనుక, వారు **మెలకువగా నుండవలెనని ప్రభువు** తన శిష్యులను మందలించాడు. వారు ఆయన రాకడ కొరకు సిద్ధపడి యుండవలెనని పదే పదే పలుమార్లు ఆయనను వెంబండించుచుండిన వారిని యేసు హెచ్చరించిన విషయములు ఆయన చేసిన ఒలీవల కొండ మీద ప్రసంగములో కలవు (24:42, 44, 50; 25:13). "మెలకువగా నుండుడి" అని అనువదింపబడిన గ్రీకు క్రియాపదము *grēgoreō*, "గమనించండి" లేక "అప్రమత్తముగా ఉండుడి" అని కూడ అనువదింపబడవచ్చును. ఇదే పదము యేసు మరియు ఆయన శిష్యులు గెత్సేమనే తోటలో ఉన్న సన్నివేశములో, వారు మెలకువగా

ఉండి ప్రార్థన చేయవలెనని నిదురించుచుండిన తన శిష్యులకు ఆయన ఆదేశములిచ్చిన సందర్భములో అగుపించును (26:38, 40, 41).

**వచనము 43.** ఆయన రెండవ రాకడ విషయంలో మెలకువగా ఉండవలసిన ప్రాముఖ్యతను సోదాహరణంగా వర్ణించుటకు యేసు ఒక సాదృశ్యమును చెప్పాడు: **ఏ జామున దొంగ వచ్చునో ఇంటి యజమానునికి తెలిసియుండిన యెడల, అతడు మెలకువగా ఉండి, తన యింటికి కన్నము వేయనియ్యడని మీరెరుగుదురు.** "ఇంటి యజమానుడు" అని ఇచ్చుట అనువదింపబడిన గ్రీకు పదము (*oikodespotēs*) మత్తయి వ్రాసిన సువార్తలో, ముఖ్యంగా ఉపమానములలో తరుచుగా అగుపించును (10:25; 13:27; 20:1, 11; 21:33). ఈయన ఇంటి యజమానుడై యుండెను, అనగా తన భార్య, పిల్లలు మరియు దాసదాసీలకు ఆయన యజమానుడై యుండెనని అర్థము. దొంగ అతని యింటికి ఏ సమయంలో వచ్చునో ఆయనకు తెలిసియుండియుంటే, ఆయన అందుకు తగిన విధంగా సిద్ధపడియుండెడివాడే. నిద్రపోకుండా మెలకువతో ఉంటూ, తన దాసులను కాపలా నిమిత్తము ఏర్పాటుచేయును, అవసరమునుబట్టి పొరుగువారి సహాయమును సహితము అర్థించును. "ఏ జాము" అను పదజాలమునకు "రాత్రి యందలి ఏ జాము" అనునది అక్షరార్థమై యున్నది. ఆ యా జాముల గూర్చి యూదులు ఏర్పాటుచేసికొనిన దాని ప్రకారంగా, రాత్రి సమయము మూడు జాములుగా విభజింపబడినది, అయితే రోమీయుల పద్ధతి ప్రకారంగా అది నాలుగు జాములుగా విభజింపబడినది (14:25పై గల వ్యాఖ్యానము చూడు). "[ఇంటికి] కన్నము వేయుట" అను అర్థమిచ్చు గ్రీకు పదము *diorussō*, "[ఇంటి] లోనికి త్రవ్వుట" అని అర్థమిచ్చును. దొంగ, ఇంటి లోనికి ప్రవేశించగలుగునట్లు వానికి గల మట్టి ఇటుకలతో కట్టబడిన గోడ గుండా త్రవ్వు అలవాటును ఈ పదము తెలుపుచున్నది (6:19, 20పై గల వ్యాఖ్యానము చూడు). క్రొత్త నిబంధనలో అటుతరువాత, యేసు యొక్క రెండవ రాకడ రాత్రివేళ వచ్చు దొంగతో పోల్చబడినది (1 థెస్సలొనీకయులకు 5:2, 4; 2 పేతురు 3:10; ప్రకటన 3:3; 16:15).

**వచనము 44.** ఆయన రాకడ గూర్చి ముందుగానే ఎటువంటి హెచ్చరికయైనను చేయబడదని ఉపదేశించుటకు యేసు ఈ సాదృశ్యమును ఉపయోగించాడు. యేసు తిరిగి వచ్చుచున్నాడు, కానీ ఆయన రెండవ రాకడతో సంబంధము కలిగియున్న సంఘటనలు, ఒకడు తన ఆధ్యాత్మిక పరిస్థితిని మార్చుకొనుటకు సమయమే లేనంత ఆకస్మికముగా సంభవించునని సమస్త జనులు తెలిసికొందురు. ఒక సమయంలో, లేదా **ఒక గడియలో**, అది ఏమాత్రమును ఎదురుచూడబడని గడియలో ఆయన తిరిగి వచ్చును.

**వచనములు 45–47.** ఆ తరువాత, **యజమానుడు తన యింటివారికి తగినవేళ అన్నము పెట్టుటకు వారిపైన ఉంచిన నమ్మకమైనవాడును బుద్ధిమంతుడునైన దాసుడెవడు?** అని యేసు వారినడిగాడు. యేసు తన శిష్యుల సావధానమును ఒక ఇంటి "యజమానుడు" (*kurios*) నుండి ఒక ఇంటిలోని వారందరికి అన్నము పెట్టుటకు ఏర్పాటుచేయబడిన దాసుని వైపు మళ్లిస్తున్నాడు. ఒక దాసుడు తన బాధ్యతల యెడల కలిగియుండగల రెండు భిన్నమైన వైఖరులను ఆయన పేర్కొనుచున్నాడు. మొట్టమొదటిగా, వాని గృహనిర్వాహకత్వము గూర్చి మనస్ఫూర్తియైన శ్రద్ధగల "నమ్మకమైనవాడు మరియు బుద్ధిమంతుడైన" దాసుడు. తన యజమానుని రాక కొరకు సిద్ధపడిన ఈ దాసుడు ధన్యుడని యేసు సెలవిచ్చాడు.

ఈ దాసుడు తనకప్పగింపబడిన బాధ్యతల విషయంలో నమ్మకమైనవాడై యుండెను గనుక, యజమాని వానిని **తన యావదాస్తి మీద బాధ్యునిగా** చేయును. అదనపు భాధ్యతలు పొందుటకు గల ప్రాతిపదిక మరొక పర్యాయము తలాంతుల ఉపమానములో అగుపించుచున్నది (25:21, 23).

**వచనములు 48–51**. యేసు అటుతరువాత, **అయితే దుష్టుడైన యొక దాసుడు–నా యజమానుడు ఆలస్యము చేయుచున్నాడని తన మనస్సులో అనుకొని,** తన తోడి దాసులను కొట్ట మొదలుపెట్టి ... ఆ దాసుడు కనిపెట్టని **దినములోను** వాడనుకొనని గడియలోను **వాని యజమానుడు వచ్చినట్లయితే ...** అని చెప్పాడు. ఇతడు భిన్నమైన పరిస్థితులలో పేర్కొనబడుచున్న అదే దాసుడై యుండును. వాని యజమానుడు తిరిగి వచ్చుటకు ఆలస్యము చేయుచున్నాడని గమనించి, ఈ దాసుడు తన తోడి దాసులను – ఎవరి విషయములోనైతే ఇతడు బాధ్యుడై యుండునో, వారినే – కొట్ట మొదలుపెట్టాడు! వారందరు సరైన సమయానికి భోజనము చేయుచున్నారని రూఢిపర్చుకొనుటకు బదులుగా, ఈ దాసుడు **త్రాగుబోతులతో తినుచు త్రాగుటకు** మొదలుపెట్టాడు.

యజమానుడు అనుకొనని గడియలో తిరిగి వచ్చి, ఈ దాసుని ఏవగింపుకలిగించే ప్రవర్తనను గమనించి, **వానిని నరికించి వేషధారులతో కూడ వానికి పాలు నియమించును**. అక్కడ **ఏడ్పును పండ్లుకొరుకుటయు** నుండును. కీనర్ చెప్పుచున్నదాని ప్రకారంగా, ప్రాచీన ప్రపంచములో ఉపమానములు చెప్పబడినప్పుడు దూర ప్రయాణంచేసి వెళ్లు ఒక రాజు, భర్త, లేక యజమానుని ప్రతిరూపము సర్వసామాన్యముగా ప్రయోగింపబడినది. అప్పుడప్పుడు, ఈ యజమానులు తమ సతీమణుల లేక దాసుల నమ్మకత్వమును పరీక్షించి తెలిసికొనుటకు వారు లేక వారి దాసులు మొదట్లో అనుకొన్న సమయాని కంటె ముందుగానే లేదా చెప్పకుండానే తిరిగి రావచ్చును.[4] ఒక ఇంటిలోని సభ్యులు తమ యజమానుని యెడల అపనమ్మకస్థులై యున్నారని కనుగొనబడినట్లయితే వారు బహు తీవ్రముగా శిక్షింపబడిరి. ఒక వ్యక్తిని “నరికించుట” లేదా “రెండు ముక్కలుగా నరికించుట” (NKJV), ప్రాచీన ప్రపంచంలో ఉరిశిక్ష విధింపబడిన నేరస్థుని యెడల చేపట్టబడిన ఒక సుపరిచితమైన చర్యయై యుండినది (1 సమూయేలు 15:33; 2 సమూయేలు 12:31; దానియేలు 2:5; 3:29; హెబ్రీయులకు 11:37).[5] 51వ వచనములోని చివరి పదజాలము, “ఏడ్పును పండ్లుకొరుకుటయు,” మత్తయి వ్రాసిన సువార్తలో యింకా ఐదుసార్లు (8:12; 13:42, 50; 22:13; 25:30), లూకా వ్రాసిన సువార్తలో ఒక్కసారి (13:28) అగుపించుచున్నది.

ఈ కథ తీర్పును గూర్చినదై యున్నది. ఒకడు తన క్రైస్తవ గృహనిర్వాహకత్వములో నమ్మకమైనవాడై యున్నట్లయితే, వానికి సముచితమైన ప్రతిఫలముండును. వానికప్పగింపబడిన గృహనిర్వాహకత్వములో వాడు అపనమ్మకమైన వాడైనట్లయితే, వాడు “ఏడ్పును పండ్లుకొరుకుటయు” గల స్థలములో వేయబడుట ద్వారా శిక్షింపబడును. నమ్మకమైన గృహనిర్వాహకత్వములో మెలకువతో ఉంటూ ప్రభువు రాకడ కొరకు ప్రార్థించుట ఇమిడి యున్నది.

## రెండవ రాకడ (24:29-31, 36-51)

యేసు క్రీస్తు తిరిగి వచ్చుచున్నాడు! ఈ వాస్తవము విషయమై మనము తిరుగులేని నిశ్చయముగలవారమై యుండవచ్చును. ఇంకా, ఆయన రెండవ రాకడ తన మొదటి రాకడ కంటె నాటకీయమైన రీతిలో భిన్నమైనదై యుండునని కూడ మనకు తెలియును. మనకు తెలియనిదెల్లా, ఆయన తిరిగి వచ్చు సమయమే!

1. *ఆయన ప్రభావముతోను మహిమతోను తిరిగి వచ్చునని యేసు వాగ్దానం చేసాడు* (24:29-31). ఆయన ఆకాశ మేఘారూఢుడై వచ్చును గనుక "ఏర్పరచబడిన తన వారిని" పోగుచేయుటకు మహా బూర శబ్దముతో తన దూతలను పంపును.

2. *ఆయన తిరిగి వచ్చినప్పుడు, ఎటువంటి సూచనలైనను ఉండవని ఆయన వాగ్దానం చేసాడు* (24:36-41). ప్రభువు తిరిగి వచ్చు దినముగాని గడియగాని యే మనుష్యునికైనను తెలియదు. ఆయన రాకడ, నోవహు దినములలోని జలప్రళయము వోలె, అనుకొనని గడియలో జరుగునని చెప్పాడు.

3. *ఆయన రాకడ గూర్చిన ముందు ప్రకటన ఏదియు చేయబడదనియు, గనుక అది ఆకస్మికముగా జరుగుననియు ఆయన వాగ్దానం చేసాడు* (24:42-44). ఆయన రాత్రివేళ వచ్చు దొంగ వలె వచ్చును. మనము అనునిత్యము సంసిద్ధులమై యుండవలసినదే, ఏలయనగా ఆయన వచ్చును కదా అని మనము అనుకొనని గడియలో ఆయన రావచ్చును.

*ముగింపు.* తన ప్రజలు ఆయన రాకడ కొరకై సిద్ధపడి యుండవలెనని యేసు వారికి పిలుపునిచ్చుచున్నాడు. మత్తయి సువార్త 24వ అధ్యాయం, ఇద్దరు దాసులు పోల్చబడుచున్న ఒక ఉపమానముతో ముగియుచున్నది (24:45-51). ఈ ఇద్దరు దాసులలో ఒకడు "నమ్మకమైనవాడును బుద్ధిమంతుడునై," తన విధులను బహు జాగ్రత్తగా నిర్వర్తించుచుండెను. రెండవవాడు "దుష్టుడై," తన తోడి దాసులను కొట్టుచు తన యజమానుని ఆస్తిని పాడుచేయుచుండెను. యజమానుడు తిరిగి వచ్చినప్పుడు, అతడు నమ్మకమైన దాసునికి పదోన్నతి కలిగించాడు, వానిని తన యావదాస్తి మీద అధికారిగా ఉంచాడు. ఏది ఏమైనా, దుష్టుడైన దాసుడు ముక్కలుగా నరికివేయబడినాడు. నీవు ప్రభువు రాకడ కొరకు కనిపెట్టుచున్న ఒక నమ్మకమైన దాసుడవేనా? ఆయన తిరిగి రాక మునుపే నీవు ఆయన యొద్దకు వచ్చెదవా?

## యేసు తిరిగి వచ్చుచున్నాడు! (24:29-31, 36-51)

"హార్మెగిద్దోను యుద్ధము"! "కొనిపోబడుట"! (ఎత్తబడుట), "యేసుక్రీస్తు ఇహలోక సహస్రాబ్ది పరిపాలన"!

అంత్య కాలము గూర్చి అనేకులు అనేక విషయాలు వినుచుండగా, వారు ... గూర్చి విందురు.

*హార్మెగిద్దోను యుద్ధము.* ప్రకటన గ్రంథంలో సోదాహరణంగా చిత్రీకరింపబడిన చిట్టచివరి యుద్ధము ఒక ఆధ్యాత్మికమైన సంగ్రామమై యున్నది, అది

భౌతికమైన సంఘర్షణ కాదు. క్రీస్తు విరోధులు ఆయనకు వ్యతిరేకముగా నిలుచుటకు వారికి శక్తిలేదు. వారు క్రీస్తుపై మరియు శక్తివంతమైన ఆయన దూతలపై విజయము సాధించలేరు (చూడు ప్రకటన 19వ అధ్యాయం). "హార్‌మెగిద్దోను" అను పదము ఒక స్థలమును మించిన విషయాన్ని సూచిస్తూ "వాటర్లూ" మరియు "పెరల్ హార్బర్" వంటి నామముల వలె అయ్యింది. "హార్‌మెగిద్దోను" దుష్టత్వము యొక్క అంతిమ మరియు చరమ పరాజయముతో సంబంధము కలిగి యున్నది; కానీ ప్రకటన గ్రంథంలో అది తొలి శతాబ్దమునాటి సంఘము యొక్క మహా హింసకుని, అనగా రోమా సామ్రాజ్యమును సూచించుచున్నది.

*కొనిపోబడుట* (ఎత్తబడుట). సంఘము ఎత్తబడుటకు సంబంధించినంత వరకు, సహస్రాబ్ది పరిపాలనకు పూర్వపు కాలము గూర్చిన దృక్పథము గలవారు వర్ణించునటువంటిదేదియును పరిశుద్ధ బైబిలులో లేదు. 1 థెస్సలొనీకయులకు 4:14-16లో, మృతులైన తమ ప్రియులు ప్రభువు రాకడను చూడలేరని భయపడుచుండిన థెస్సలొనీకయలోని క్రైస్తవులకు పౌలు ప్రోత్సాహము నిచ్చుచుండెను. వారి ఆత్మలు మర్చిపోబడవు, కానీ ప్రభువును ఆకాశమందు కలిసికొనుటకు అక్షయమగు శరీరములతో కూడ లేపబడును.

*సహస్రాబ్ది పరిపాలన.* యేసు క్రీస్తు ఈ పుడమిపై వెయ్యేళ్లు పరిపాలన చేయుట గూర్చిన మాటేమిటి? ప్రకటన 20:4-6 ఏ విషయాన్ని తెలియజెప్పుటలేదో గమనించండి. యేసు క్రీస్తు ఈ పుడమిపై, దావీదు సింహాసనాసీనుడై, లేదా యెరూషలేములో పరిపాలించుట గూర్చి ఈ వాక్యభాగము పేర్కొనుట లేదు; సరికదా, ఆయన పరిపాలన ఎప్పుడు ఆరంభమౌతోందో లేక ఎప్పుడు అంతమౌతోందో కూడ అది చెప్పుటలేదు. రోమా సామ్రాజ్యాధికార సంఘ హింసాకాండలో మరణించిన హతసాక్షుల పరిపాలన గూర్చి అది వర్ణించుచున్నది: "... వారు బ్రదికినవారై, వెయ్యి సంవత్సరములు క్రీస్తుతో కూడ రాజ్యము చేసిరి" (ప్రకటన 20:4). ఇది ఎక్కడ జరుగుచుండినది? పరలోకములో (ప్రకటన 20:1). క్రీస్తు ఎంత కాలము పరిపాలించునో పేర్కొనబడలేదు; హతసాక్షులు క్రీస్తుతో కూడ ఎంత కాలము పరిపాలన చేయుదురో దాని గూర్చి మాత్రమే ఈ గ్రంథ పాఠము చెప్పుచున్నది.

లోకాంతము వచ్చుచున్నది, కానీ "ఆ దినమున గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను కూమారుడైనను ఎరుగరు" (24:36). క్రీస్తు ఒక దొంగ వలె వచ్చును (2 పేతురు 3:10). ఆయన ఆకాశ మేఘారూఢుడై వచ్చునప్పుడు (ఆయన భూమి మీద తన కాలు మరలా మోపడు), ఈ లోకము సంపూర్తిగా నాశనమగును (2 పేతురు 3:10-12). ఏదో ఒక రోజున ఈ సంఘటనలు సంభవించును. మనము "మెలకువగా ఉండి ప్రార్థన చేయుచు" (26:41) ప్రభువు రాకడకు సంసిద్ధులమై యుండుటయే మనకు ప్రాముఖ్యమైన విషయమై యున్నది.

హార్‌మెగిద్దోను యుద్ధము, ఎత్తబడుట, మరియు సహస్రాబ్ది పరిపాలన సాక్షాత్తూ సంభవించుట గూర్చి బైబిల్ ఏమని సెలవిచ్చుచున్నది? "చెప్పుకోదగినంతగా చెప్పుటలేదు!" బైబిల్ హార్‌మెగిద్దోను యుద్ధము గూర్చి పేర్కొనుచున్నది, కానీ అది ప్రవక్తలై యుండబోవుచుండినవారు వర్ణించినట్లుగా లేదు (చూడు ప్రకటన 16:16; 19:11-21). ఆకాశమండల మేఘముల మీద వచ్చు ప్రభువును కలిసికొనుటకు

ప్రజలు “కొనిపోబడుదురు” - కానీ ఇది “మహా శ్రమ” కలుగక మునుపు సంఘము ఎత్తబడుట గూర్చినది కాదు (చూడు 1 థెస్సలొనీకయులకు 4:13-18). ఆయనతో కూడ హతసాక్షులు లేకుండా యేసు క్రీస్తు నిర్వహించు ఇహలోక వెయ్యేళ్ల పరిపాలన గూర్చి, ఎవరైన తమ అభిప్రాయమును ప్రకటన 20:4-6కు భిన్నంగా తెలియజెప్పినట్లయితే, అది సరైన అభిప్రాయము కాదు.

## వెయ్యేళ్ల పరిపాలనకు ముందటి కాలము నిజమేనా? (24:29-31, 36-51)

యేసు ఈ లోకములో ఉండుటకును, తన ఇహలోక రాజ్యమును యెరూషలేములో ఏర్పాటు చేయుటకును తిరిగి వచ్చునను సిద్ధాంతము అనేక హేతువులనుబట్టి బైబిలు సంబంధమైన బోధలకు హానికరమైనది. ఇటువంటి భావనలను ఎందుకు నిరాకరించాలో, మనము కొన్ని హేతువులను పరిశీలనగా పరిశీలించుదాము.

1. ఆయన వాగ్దానము చేసినట్లుగానే క్రీస్తు తన రాజ్యమును స్థాపించాడని అది ఒప్పుకొనదు. వెయ్యేళ్ల పరిపాలనకు ముందటి కాలము గూర్చిన వాదము, (1) ఆయన తన రాయబార కార్యములో తన రాజ్యమును స్థాపించుటకు విఫలుడయ్యాడనియు (2) సంఘము ఆతురముతో కూడినదియు, అధమమైన ప్రత్యామ్నాయమై యున్నదనియు చెప్పుచున్నది. అయితే బైబిలు ఇందుకు వ్యతిరేకముగా ఉపదేశించుచున్నది (అపొస్తలుల కార్యములు 2:36; 1 కొరింథీయులకు 15:24-26; ఎఫెసీయులకు 1:20-23; కొలొస్సయులకు 1:13; హెబ్రీయులకు 12:28; ప్రకటన 1:9).

2. అది దేవునిని మరియు క్రీస్తును అబద్ధపు బోధకులను చేయుచున్నది (దానియేలు 2:44; మార్కు 9:1; అపొస్తలుల కార్యములు 1:6-8).

3. అది యేసు కాలము నాటి యూదులు చేసిన అదే పొరపాటును చేయుచున్నది. ఆ నాటి యూదులు యేసు ఇహలోక రాజ్యమును స్థాపించునని ఎదురుచూసారు. యేసు, “నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు” అని సెలవిచ్చాడు (యోహాను 18:36).

4. ఈ సిద్ధాంతము, వెయ్యేళ్ల పరిపాలనా కాలములో ఒకడు దేవునికి లోబడగలుగుటకు రెండవ అవకాశముగలదను ఒక తప్పుడు ఆశను ప్రజల్లో కలిగించుచున్నది.

5. ఈ సిద్ధాంతము బైబిలు సంబంధమైన ప్రవచనమును తప్పుగా ఉపయోగించుచున్నది, చిహ్నాత్మకములను అక్షరార్థముగా అనువదించుట ద్వారా ప్రకటన గ్రంథమును దూషించుచున్నది, నెరవేరిన ప్రవచనముల గూర్చి ప్రజల మనస్సుల్లో సందేహములు కలుగజేయుచున్నది.

---

సూచనలు

[1]“కుమారుడనను” అను పదజాలము మత్తయి సువార్తకు సంబందించిన కొన్ని ప్రాచీన చేతి రాతి వ్రాతులలో మినహాయింపబడినది, బహుశా దానిలో ఇమిడియున్న వేదాంతశాస్త్ర సంబంధమున కేషము ఇందుకు ముఖ్య హేతువై యుండవచ్చును. ఏది ఏమైనా, మార్కు 13:32లో అది నిర్వివాదాంశమయ్యింది. (Bruce M. Metzger, *A Textual Commentary on the Greek New Testament*, 2d ed. [Stuttgart: German Bible Society, 1994], 51–52.) [2]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 492. [3]Leon Morris, *The Gospel*

*according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 615. [4]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 594–95. [5]Homer *Odyssey* 18.339; Livy 8.24.14; Diodorus Siculus 16.16.4; 17.83.9; 33.15.1; Herodotus 2.139; 7.39.